హిమంతో స్నానించిన మరువాన్ని చూసి, మల్లెపువ్వు జత కలిపిందిట. మత్తెక్కే మల్లెల్ని చూసి, వాటి మధ్య తనూ వున్నానన్న కించిత్ గర్వంతో మరువం... మురిపెంగా నవ్వే వేళ..

అతగాడు మరువమున్న మల్లెల్ని, ఆ మల్లెల్ని జడలో తురిమి మరులు గొలిపే తన నెచ్చెల్ని ముద్దు చేస్తూ... అది ఆలింగనమో...సర్వాంగలింగనమో... ఆ గాఢ పరిష్వంగనంలో... నిగూఢమైన సృష్టి రహస్యాలను అన్వేషించే ప్రయత్నంలో...

అతడు 'శ్రీ'లోలుడే అయ్యాడు.

# 'శ్రీ' లోలుడు

A

## అడల్ట్స్ ఓన్లీ కథ!

ముచ్చర్ల రజనీ శకుంతల

★ ★ ★

''ఏయ్ శ్రీ...జాగ్రత్త...పక్కనున్న నన్ను వదిలి, అలల్ని ముద్దాడే ప్రయత్నం చేయకు..'' ముద్దుగా హెచ్చరిస్తూ అన్నాడు తన బెటరాఫ్ శ్రీజని ఉద్దేశించి కుశల్.



శ్రీజ అతడి మాటలు పట్టించుకోనట్టు సముద్రానికి అభిముఖంగా తనకి ఎదురు వచ్చే అలల్ని ఢీకొనడానికి అన్నట్టు ముందుకు నడుస్తోంది.

ఒక్కో అల ఆమె పాదాల దగ్గరకి వచ్చి, ఆమె లేత తెల్లటి పాదాలను చూసి, మురిసి, మెరిసి, ముద్దాడి, వెనక్కి వెళ్ళి, తోటి అలల చెలిగాళ్ళతో చెబుతోన్నట్టు, ఒక్కో అల వెనక్కి వెళ్ళి, మళ్ళీ ముందుకు వస్తోంది.

చలి పెత్తనం మొదలైంది. బీచ్‌లో అక్కడక్కడ జంటలు చలిని చూసి కోపంగా, దాన్ని పారద్రోలే ప్రయత్నంలో దగ్గరకు జరుగుతున్నారు.

★ ★ ★

శ్రీజ, కుశల్ అక్కడికి వచ్చి అప్పటికే రెండు గంటలు దాటింది. రోజూ సాయంత్రాలు బీచ్‌లో కూచుని, తమని అప్పుడప్పుడు పలకరించి వెళ్ళే అలల్ని చూస్తూ రాత్రి వరకూ గడపడం వారికి రివాజు.

ఇరవై రెండేళ్ళ శ్రీజ పెళ్ళి రెండేళ్ళ క్రితం కుశల్‌తో జరిగింది. ఈ రెండేళ్ళూ వాళ్ళకు రెండు నిమిషాలుగా గడిచిపోయాయి. ఒకరంటే ఒకరికిష్టం... ఎటువంటి పరిస్థితుల్లోనూ కుశల్‌ని మిస్ చేసుకోవడానికి ఇష్టపడదు శ్రీజ. అతను ఆఫీసుకు వెళ్ళినా, అతని 'సెల్'తో టచ్‌లో వుంటుంది శ్రీజ.

★ ★ ★

ఇద్దరూ ఇసుకలో కూచున్నారు. శ్రీజ ఇంకా ఆలోచిస్తూనే వుంది.

''ఏయ్ శ్రీ.. ఏమిటి.. ఇవ్వాళ బీచ్‌కు వచ్చినప్పట్నించీ చూస్తున్నాను. పరధ్యానంలో వుండిపోయావు. నీకు నా 'ధ్యానం' తప్ప

'పర' ధ్యానం వుంటే భరించలేను తెలుసా..'' తర్జని చూపిస్తూ అన్నాడు కుశల్.

ఒకసారి భర్త వంక చూసింది. కళ్ళలో ప్రేమ, పెదవుల్లో అమృతం..ఆ ప్రేమామృతం రుచి తెలియనిది కాదు. సాయంత్రం తన ఫ్రెండ్ విశాల అన్న మాటలే ఆమెను సందిగ్ధంలో పడవేశాయి.

తనని చూడ్డానికి హైదరాబాద్ నుంచి వచ్చిన విశాల...

★ ★ ★

''ఏయ్ శ్రీజ...మీవారు సకల కళావల్లభుడా?'' అడిగింది విశాల కిచెన్‌లో ఉల్లిపాయ పకోడీలు చేస్తున్న శ్రీజని.

''సకల కళా వల్లభుడా! అంటే ఏమిటి? కొంపదీసి పంచతంత్రం సినిమాలో కమల్‌హాసన్ లాగానా?'' పకోడీలు చేస్తూనే అడిగింది శ్రీజ.

''ప్చ్... నువ్వొట్టి చలిమిడి ముద్దవే..ఏ మగాడైనా సకల కళా వల్లభుడే..''

''అబ్బ...అసలు విషయం చెప్పవే?'' విసుక్కుంది శ్రీజ. విశాల తన గెస్ట్‌గా రావడం బాగానే వున్నా, ఇప్పుడు కుశల్ వచ్చే వేళ... ఈ సమయంలో అతని ప్రజెన్స్‌ని మిస్సవ్వడం భరించలేకపోతోంది! అతనికి ఇష్టమైన ఉల్లిపాయ పకోడీ చేసే సమయంలో విశాల వచ్చింది. ఎంతమంచి ఫ్రెండయితే మాత్రం..వెంటనే వెళ్ళి రేపొద్దున్న వస్తే బావుండు..ఈ రాత్రిని కుశల్‌తో మిస్సవ్వడం భరించలేకపోతోంది.

''పిచ్చి శ్రీజా...సకల కళా వల్లభుడు అంటే మరేమీ లేదు, మీ శ్రీవారు..మాంచి పొజిషన్‌లో వున్నాడు. పైగా అందగాడు. అతని ఆఫీసులో అందమైన స్టెనో వుండొచ్చు, అదిరిపోయే అందం వున్న సబార్డినేటు వుండొచ్చు. మగాళ్ళు ఎలానూ స్త్రీలోలురే. ఈ విషయంలో ఎవరైనా మినహాయింపు కాదు..అందుకని..''

''కుశల్ గురించి అలా అనకు. అతనికి అలాంటి అలవాట్లు లేవు. నేనే అతని ప్రపంచం, అయిదు క్షణాలు ఆలస్యమైనా అతను నా అబ్సెన్సీ భరించలేడు తెల్సా..'' చెప్పింది గర్వంగా శ్రీజ.

''భార్య ముందు ఏ మగాడైనా అలానే ప్రవర్తిస్తాడు. అవకాశం రానంత వరకే ఏ మగాడైనా శ్రీరామచంద్రుడు. అవకాశం వస్తే శ్రీకృష్ణుడే. స్త్రీలోలుడే'' నవ్వి కన్నుగీటి అంది విశాల.

''కుశల్ గురించి నీకు తెలియదు. అతను అలాంటి వాడు కాదు. వందమంది అమ్మాయిలు వచ్చి, అతని ముందు నేకెడ్‌గా నిలబడ్డా చలించడు.''

''పోన్లే, నీ భ్రమని నేనెందుకు కాదనాలి. ఆ భ్రమలో ఆనందం వుంటే అలానే సంతోషంగా వుండు'' అంది విశాల.

దాంతో శ్రీజలో పట్టుదల పెరిగిపోయింది.

''మా ఆయన స్త్రీలోలుడు అని నిరూపిస్తావా?''

''వద్దులే. నువ్వు బాధపడ్తావు. రిజల్ట్ చూసి''

''అలాంటి భయం నాకు లేదు. ఇంక బాధెందుకు'' నమ్మకంగా అంది శ్రీజ.

''సరే. అయితే మన బెట్ సంగతి మీ ఆయనకు చెప్పకు. రోజూ మీరూ బీచ్‌కు వెళ్ళి వస్తారని చెప్పావు కదా. ఈరోజు బీచ్ నుంచి రాగానే హెల్త్ అప్‌సెట్ అయినట్టు పడుకుండి పో. ఈరోజు రాత్రి వంట నేనే చేస్తాను. రేపేపాటికి రిజల్ట్ నీకే తెలుస్తుంది. ఏం జరుగుతుందో చెప్పను. నువ్వే చూస్తావ్'' అంది విశాల.

ఆ పందెం అలా ప్రారంభమైంది.

★ ★ ★

''శ్రీ... నిన్నే... '' శ్రీజ భుజం తట్టి పిలిచాడు కుశల్.

శ్రీజ తల తిప్పి కుశల్ వైపు చూసింది. అదే ప్రేమ..అదే స్వచ్ఛత.

''శ్రీ..అలలు చూడు. నీ పాదాల దగ్గరికి వచ్చి, నీ తెల్లటి పాదాలను ముద్దాడి వెనక్కి వెళ్ళి తోటి అలలతో నీ పాదల సౌందర్యాన్ని చెబుతూ, నిన్ను తాకడానికి మళ్ళీ పరుగెత్తుకు వస్తున్నాయి. ఒక్కోసారి ఆ అలలను చూస్తే ఈర్ష్య కలుగుతుంది. ఎందుకో తెలుసా శ్రీ...మనం బీచ్‌కు వచ్చినప్పుడల్లా లెక్కలేనన్ని సార్లు ఆ అలలు నీ దగ్గరికి వచ్చి నీ పాదాలను తాకి వెళ్తుంటాయి'' అని ఓసారి చుట్టూ చూసి, మెల్లిగా తన తలను కిందకి తెచ్చి, గోరింటతో మెరిసిపోతోన్న ఆ తెల్లటి పాదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.



## ప్రీతీ కొత్త గెటప్

**కన్నడ నటుడు ఉపేంద్ర సినిమాలంటే వెరైటీగా ఉంటాయి. ప్రీతిజింగ్యానితో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నాడు. టాలీవుడ్ నిర్మాత మేడికొండ మురళీకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర మరో కొత్త గెటప్‌లో కన్పించనున్నాడు. ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ పని జరుగుతోంది. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ చిత్రంలో డిఫరెంట్ గెటప్‌లో కన్పించడానికి ప్రీతీ కూడా సన్నద్ధమవుతోందిట. సరైన సినిమా ఆఫర్లు లేని ప్రీతి జింగ్యానీ ఈ 'స్టుపిడ్'తో కలిసి ఎలా నటిస్తుందో చూడాల్సిందే అంటున్నారంతా.**

‘‘ఏయ్..శ్రీ..’’ చిన్న ప్రకంపనం పాదాల నుంచి మొదలై పెదాల వరకూ విస్తరించింది. అతని స్పర్శ, అతని సాన్నిహిత్యం, తనలో ఎంతటి భద్రతా భావాన్ని కలిగిస్తుంది!

ఇద్దరూ లేచారు. ఇంటివైపు కదిలారు.

★ ★ ★

లుంగీలోకి మారి, బెడ్ మీద నిస్త్రాణంగా పడి వున్న భార్యని చూసి కంగారుగా అడిగాడు కుశల్ ‘‘ఏయ్ శ్రీ ఏమైంది?’’

‘‘కాస్త ఒంట్లో నలతగా వుంది’’ అంది నీరసంగా శ్రీజ.

‘‘నలతా... ఉండు డాక్టర్‌ని తీసుకువస్తా’’ కంగారు పడిపోయాడు కుశల్.

‘‘చిన్న నలతే..ప్లీజ్ కిచెన్‌లో విశాల ఒక్కర్తే వంట చేస్తోంది. కాస్త సాయంగా వుండండి. మన గెస్ట్ కదా!’’

‘‘ముందు డాక్టర్‌ని పిలవనీ..’’ కుశల్ కంగారు పడిపోయాడు.

‘‘ప్లీజ్ కుశల్. చిన్న నలత. అంతే. రెండు గంటలు రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది. మీరీలోగా విశాలకు హెల్ప్ చేయండి. ప్లీజ్. భోజనాల టైంకు తగ్గిపోతుంది’’

‘‘సరే..నువ్వు రెస్ట్ తీసుకో’’ అని కిచెన్ వైపు కదిలాడు.

★ ★ ★

విశాల ఓరకంటితో కుశల్‌ని గమనిస్తోంది. అతని పరధ్యానం తెలుస్తూనే వుంది. పది నిమిషాలకోసారి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి శ్రీజ యోగక్షేమాలు కనుక్కుని వస్తున్నాడు. వద్దన్నా వినకుండా, పళ్ళరసం చేసి తీసుకు వెళ్లాడు.

విశాల అతడ్ని మాటల్లోకి దింపాలని ప్రయత్నించింది. కానీ అతను అన్యమనస్కంగానే వున్నాడు. ఏదో ఓ వంకతో అతడ్ని టచ్ చేస్తూనే వుంది. అతనా ‘టచ్’ని అసంకల్పిత స్పర్శగానే స్వీకరిస్తున్నాడు. అతనిలో ఏ రియాక్షనూ లేదు.

కుశల్ అసలు విశాలను గమనించడం లేదు. ఓ వ్యక్తి ప్రజెన్స్ వుందన్న విషయం అతనికి స్ఫురణకు వచ్చినట్టు లేదు.

మాటల ద్వారా, చేతల ద్వారా అతడ్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది. అయినా అతని మనసంతా శ్రీజ పైనే!

చివరాఖరి ప్రయత్నంగా అంది ‘‘శ్రీజ అదృష్టవంతురాలు. మీలాంటి భర్త దొరకడం తన అదృష్టం..’’ అంది ఓరకంటితో అతని రియాక్షన్ చూస్తూ.

‘‘కాదు. శ్రీజలాంటి స్నేహితురాలు దొరకడం మీ అదృష్టం. అలాంటి భార్య దొరకడం నా అదృష్టం.’’ అన్నాడు కుశల్.

‘‘ఎందుకు?’’ సందిగ్ధంగా అడిగింది విశాల.

‘‘స్నేహితురాలిని యిబ్బంది పెట్టొద్దని, నన్ను సాయం చేయమని చెప్పింది శ్రీ..తన భర్త.., స్నేహితురాలైనా సరే, మరో స్త్రీతో కిచెన్‌లో వుండాల్సి వస్తుందని తెలిసినా, నన్ను మీకు సాయం చేయమంది. మీ మీద, నా మీద నమ్మకం వున్నా, తన మీద, తన మనసులో వున్న నా మీద శ్రీజకు వున్న నమ్మకం గొప్పది కదా..మీరు శ్రీజకే కాదు, నాకూ బెస్ట్ ఫ్రెండే..’’ చెప్పి, మరోసారి తన గదిలోకి వెళ్ళి ‘శ్రీజ’ని పలకరించి వచ్చాడు.

★ ★ ★

భోజనాలయ్యాక, శ్రీజ దగ్గరకి వచ్చి, శ్రీజకు మాత్రమే వినిపించేలా మనస్ఫూర్తిగా అంది విశాల.

‘‘నేనే ఓడిపోయాను. మగాడి చూపులను బట్టి, మనస్తత్వం అంచనా వేయొచ్చు. ప్రపంచంలో మగవాళ్ళంతా స్త్రీలోలురే అనుకున్నాను. ఈ ఓటమి కూడా నాకు ఆనందంగా వుంది. నా ఓటమి నా ఫ్రెండ్ గెలుపైనందుకు థాంక్యూ..’’

‘‘నేనే నీకు థాంక్స్ చెప్పాలి విశాలా. ఈ విధంగానైనా నా కుశల్ గురించి తెలిసింది. అగ్నిప్రవేశం చేయకముందే, నా శ్రీరాముడి నా ప్రియరాముడి మనసు తెలిసింది. గుడ్‌నైట్’’ విశాలకు గుడ్‌నైట్ చెప్పి బెడ్‌రూమ్ వైపు నడిచింది.

★ ★ ★

ఆ రాత్రి...

చలికి వణికే శ్రీజకు తనే వెచ్చటి దుప్పటై, తపించే ఆమె తపనలకు తన తమకాన్ని ప్రోది చేసుకొని, ఓ గమకమై, చెమట పట్టని ఆమె పెదవులపై స్పర్శయి, మొత్తంగా... ఆమెను ఆపాద మస్తకం ఆక్రమించే, అనంగు ప్రియవల్లభుడై, అతను ఆమె స్పర్శా సాన్నిహిత్యంలో సేద తీరుతోన్న వేళ..తనా ప్రియవల్లభుడికి నిజం చెప్పేసింది.

‘‘శ్రీ..ప్రియమైన భార్యను ప్రేమించేవాడెప్పుడు ప్రియవల్లభుడే. ‘భార్య’ జీవితంలో ఓ భాగం ‘మాత్రమే’ అని భావించేవాడు స్త్రీ లోలుడు అయితే అవ్వొచ్చు, కానీ భార్యే జీవితమని భావించేవాడెప్పుడూ స్త్రీలోలుడు కాడు’’ ఓ కొత్త ప్రేమతత్వాన్ని సత్యంగా ఆవిష్కరిస్తూ చెప్పాడు కుశల్.

‘‘అయితే మీరు స్త్రీలోలుడు కాదా..’’

‘‘నేను ‘స్త్రీ’ లోలుడ్ని కాదు..’’

‘‘మరీ?’’

గాలిని సైతం తమ మధ్య నియంత్రించి, చలి ఉద్వేగాన్ని ఓరకంట గమనిస్తూ, ఆమె ఎదశయ్యపై పవళిస్తూ చెప్పాడు కుశల్.

‘‘నేను ‘శ్రీ’లోలుడ్ని...నీ ప్రేమలోలుడ్ని..’’

☆

## కొత్త కెరీర్

**కాలానుగుణంగా మారితేనే అస్తిత్వాన్ని కాపాడుకోగలం. లేదంటే కాలప్రవాహంలో కొట్టుకుపోవాల్సిందే. నటి మహిమాచౌదరి ఇలాంటి జీవితసత్యాల్ని బాగా ఒంటపట్టించుకున్నట్టుంది. అందుకేనేమో మామూలు సినిమాల్ని వదిలిపెట్టేసి యానిమేషన్ చిత్రంపై దృష్టి నిలుపుతోంది. మొట్టమొదటి యానిమేషన్ చిత్రం ‘భాగ్‌మతి’ని డబ్బింగ్ చేయాలనుకుంటోంది. ఈ మేరకు ఆమె వర్క్‌ని కూడా ప్రారంభించేసింది. అవకాశం వచ్చినప్పుడు కెరీర్‌లో మార్పులు చేసుకోవడంలో తప్పులేదంటోంది. నిజమేనేమో!**

